



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
అక్టోబరు 22, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-





## కాంగ్రెస్ అభ్యర్థిని మజ్లిస్ నిర్ణయించింది

**అధికారంలో ఉన్న పార్టీ పక్కన చేరడం మజ్లిస్ నైజం**

**హైదరాబాద్‌ను సింగపూర్ చేస్తానన్న వ్యక్తి ఫాంహౌస్‌లో పడుకున్నారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**పెద్దమ్మ గుడి 11 ఎకరాల భూములు ఎంఐఎంకు: బండి సంజయ్**

**కాంగ్రెస్‌కు హామీల అమలుపై చిత్తశుద్ధి లేదు: రాంచందర్‌రావు**

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ని ఎంఐఎం నేతలు నిర్ణయించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి ని ప్రకటించిన వెంటనే మజ్లిస్ నేతలు కలసి, తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారని ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పక్కలో చేరడం మజ్లిస్‌కు అలవాటేనన్నారు. కిషన్‌రెడ్డి మంగళవారం బీజేపీ అభ్యర్థి లంకెల దీపక్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా యూసఫ్‌గూడలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయని మండిపడ్డారు. 'బీఆర్‌ఎస్ పనైపోయింది. ఆ పార్టీకి ఓటు వేస్తే మూసీలో వేసినట్లే. హైదరాబాద్‌ను లండన్, న్యూయార్క్, వాషింగ్టన్, సింగపూర్‌గా మారుస్తా అన్న వ్యక్తి ఫాంహౌస్‌లో పడుకున్నారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి,

(మిగతా 2వ పేజీలో)

# మావోలు లొంగిపోవాలి: సీఎం రేవంత్

**జనజీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి: ముఖ్యమంత్రి రేవంత్**

**రాష్ట్రంలో తీవ్రవాదులు, ఉగ్రవాదులు, మతతత్వ నేరాలు పెరగకుండా పోలీసుల కృషి భేష్**

**నిబద్ధతతో పనిచేసే అధికారులను ప్రభుత్వం గుర్తిస్తుంది... అమరుల కుటుంబాలకు అండగా ఉంటుందన్న సీఎం**

**పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి హాజరు**

**కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటన**



హైదరాబాద్: మావోయిస్టు ఉద్యమంలోని అజ్ఞాత నాయకులు జనజీవన స్రవంతిలో కలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం అందరికీ తెలుసునని, మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతతో పని చేసే అధికారుల కృషిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందని అన్నారు. మంగళవారం గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'తీవ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాలు గతంలో రాష్ట్రంలో విస్తృతంగా జరిగేవి. పోలీసుల కృషితో ఇప్పుడవి దాదాపు లేకుండా పోయాయి. గ్రేహౌండ్స్ కమాండోలు సందీప్, శ్రీధర్, పవన్ కల్యాణ్‌లు సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందితే.. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్‌లాల్, నల్లగొండ కానిస్టేబుల్ బి. సైదులు విధినిర్వహణలో

(మిగతా 2వ పేజీలో)



## పాత నేరస్తుడు రియాజ్ కాల్చివేత

**నిజామాబాద్ ఆస్పత్రిలో ఏఆర్ కానిస్టేబుల్ తుపాకీ లాక్కొని ఫైర్ చేసే యత్నం**

**తప్పని పరిస్థితిలో కాల్పులు జరిపాం: సీపీ సాయిచైతన్య**

**మృతుడు సీసీఎస్ కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడు**

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను కత్తితో పొడిచి హత్యచేసిన పాత నేరస్తుడు షేక్‌రియాజ్ సోమవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పోలీస్ కాల్పుల్లో మరణించాడు. పరారీలో ఉన్న రియాజ్‌ను ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 4వ అంతస్తులో ఖైదీల వార్డులో చికిత్స అందిస్తున్నారు. కాగా సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వార్డులోకి సాధారణ తనిఖీల్లో భాగంగా ఏఆర్ ఎస్సై, ఏఆర్ కానిస్టేబుల్ మరో ఇద్దరు సిబ్బంది వెళ్లారు. గదిలో రియాజ్ తలుపులు, కిటికీలు పగులగొట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏఆర్ కానిస్టేబుల్ రియాజ్‌ను బెడ్‌వద్దకు తీసుకెళ్లి పడుకోబెట్టాడు. అయితే రియాజ్ ఏఆర్ కానిస్టేబుల్ తుపాకీని లాక్కొని ట్రిగ్గర్ నొక్కే

(మిగతా 2వ పేజీలో)

# చివరిరోజు 189 నామినేషన్లు


**జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు మొత్తంగా 316 నామినేషన్లు దాఖలు**

**నామినేషన్లు వేసిన వారిలో ఆర్ఆర్ఆర్, ఫార్మాసిటీ భూ బాధితులు, రిటైర్డ్ ఉద్యోగులు**

**చివరిరోజు నామినేషన్లలో అర్ధరాత్రి వరకు 160 మంది దరఖాస్తులే స్వీకరణ**

**మిగిలిన వారి పత్రాలను నేడు స్వీకరించేందుకు అనుమతించిన ఈసీ**







## పాక్‌కు చుక్కలు చూపించాం

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి .. త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌ను మోకాళ్లపై నిలబెట్టాయి**

**సైన్యంలో స్వయం సమృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం**

**గోవా తీరంలో 'ఐఎన్ఎస్ విక్రాంత్'పై దీపావళి వేడుకలు**

పనాజీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత త్రివిధ దళాలు అద్భుతమైన సమన్వయంతో పనిచేసి, అతి తక్కువ సమయంలోనే పాకిస్తాన్‌ను మోకాళ్లపై నిలబెట్టాయని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. మన సైన్యం పాకిస్తాన్‌ను భయకంపితులను చేసిందన్నారు. వాయుసేన నైపుణ్యాలు, నావికాదళం

## సర్వీస్ బుక్ లో తప్పుడు సమాచారం...

# సంస్తాన్ నారాయణపురం ఎంపీఓపై విచారణకు ఆదేశం

ఉద్యోగంలో చేరే నాటికి ఆయన మైనర్... సర్వీస్ బుక్‌లో తప్పుడు సమాచారమిచ్చి ఉద్యోగంలో చేరిక

సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు

స్పందించిన ఉన్నతాధికారులు గతంలోనే విచారణకు ఆదేశం... అయినా పట్టించుకోని అప్పటి డిపిఓ సునంద

సునంద స్థానంలో బదిలీపై వచ్చిన విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాలతో విచారణకు రంగం సిద్ధం

( వార్త మిర్రర్ ప్రత్యేక ప్రతినిధి)

సంస్తాన్ నారాయణపూర్ మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కే. నరసింహారావు పై తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగంలో చేరాడన్న ఆరోపణలు సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి ( డిపిఓ ) విచారణకు ఆదేశించారు .

వివరాలలోకి వెళితే... కే నరసింహారావు ఉద్యోగంలో చేరినాటికి మైనర్ అని, తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ఉద్యోగంలో చేరారని సూర్యాపేట కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఒకరు పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీలో

బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహించిన నరసింహారావు%జూ% అప్పటి సర్పంచ్ తీర్మానం ఆధారంగా తాను మైనర్ అయినప్పటికీ, మేజర్ మనీ తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించి సర్వీస్ బుక్ లోను తప్పుడు సమాచారాన్ని పొందుపరిచారని తన ఫిర్యాదు లో సదరు వ్యక్తి పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్లు తమకు అందిన లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపించాలని అప్పటి డిపిఓ సునంద ను ఆదేశించారు. అయితే సునంద, భువనగిరి యాదాద్రి జిల్లా డిపిఓగా కొనసాగిన ఏడు నెలలకాలం వరకు నరసింహారావు పై ఎటువంటి విచారణకు విచారణ చేపట్టకుండా ఉన్నతాధికారుల ఆదేశాలను భేఖాతారు చేశారు. అయితే, సునంద స్థానంలో జిల్లా డిపిఓగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్ రెడ్డి చౌటుప్పల్ డి ఎల్పి ఓ ను విచారణ అధికారిగా నియమిస్తూ, నరసింహారావు వ్యవహారంపై తగిన విచారణ జరిపి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.

## తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడిగా క్యామ మల్లేష్ ఎన్నిక హర్షణీయం!

### కురుమ సంఘం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కార్యనిర్వాక అధ్యక్షుడిగా అపార అనుభవం

### కురుమ సామాజిక వర్గ బలోపేతం క్యామ మల్లేష్ కే సాధ్యం - డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : బీసీల నాయకుడు 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు క్యామ మల్లేష్ వారు విద్యార్థి దశలోనే రాజకీయాల పట్ల ఆసక్తితో 1984లో ఎన్ ఎస్ యు ఐ ఇబ్రహీంపట్నం జూనియర్ కళాశాల ఫౌండర్ గా రాజకీయాల్లోకి వచ్చి ఇబ్రహీంపట్నం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా, మండల పార్టీ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తూ 2013 నుంచి కురుమ సంఘం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కురుమ సంఘం బలోపేతానికి కృషి చేశారు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపోటములు సహజమని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బంగారు తెలంగాణ కై తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందాలని ప్రతి గడపకు సంక్షేమాలను అందించాలని, తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరి 2024లో జరిగిన లోక్సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా భువనగిరి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేశారు, నాటి నుండి నేటి వరకు నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తున్న నాయకుడు క్యామ మల్లేష్ అని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన క్యామ మల్లేష్ గారి సారథ్యంలో తెలంగాణ కురుమ సామాజిక వర్గం బలోపేతంకై కృషి చేయాలని తెలిపారు, కురుమ సమస్యలపై పోరు కొనసాగించాలని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన క్యామ మల్లేష్ హార్దిక శు భాకాంక్షలు తెలిపారు



**బిఆర్ఎస్ జిల్లా నాయకులు,**
**జిల్లా కురుమ**
**యువ చైతన్య నాయకులు,**
**ఆర్ ఎస్ కె ఫౌండేషన్ అధినేత,**
**సామాజికత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**

# చివరిరోజు 189 నామినేషన్లు

### జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు మొత్తంగా 316 నామినేషన్లు దాఖలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన మంగళవారం నామినేషన్లు వెల్లువెత్తాయి. భారీ సంఖ్యలో నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులతో బంజారాహిల్స్ రోడ్డు నంబర్%-%2లోని షేక్‌పేట మండల కార్యాలయంలోని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రిటర్నింగ్ అధికారి కార్యాలయం కిటకిటలాడింది. ఉదయం 8 గంటల నుంచే అభ్యర్థులు క్యూ కట్టారు. ఉదయం 11 గంటలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవగా అభ్యర్థులు భారీగా ఉండటంతో అధికారులు వారికి టోకెన్లు జారీ చేశారు. ఇలా మొత్తం 189 నామినేషన్లకు అధికారులు టోకెన్లు అందించారు. ఈ టోకెన్ల ప్రకారం అభ్యర్థులను లోపలకు పిలిచారు. ఒక్కో అభ్యర్థి నామినేషన్ సమర్పించేందుకు 15 నిమిషాలు పట్టగా రాత్రి 12 గంటల వరకు 160 నామినేషన్ల పత్రాలను మాత్రమే రిటర్నింగ్ అధికారి తీసుకోగలిగారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన అధికారులతోపాటు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్, రిటర్నింగ్ అధికారి సాయిరాం తదితరులు అభ్యర్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఈసీని బుధవారం వరకు గడువు కోరారు. దీంతో ఈసీ అనుమతి మేరకు టోకెన్లు ఎంత మందికి జారీ చేస్తే వారందరి నుంచి నామినేషన్ పత్రాలు తీసుకోవాలని.. బుధవారం ఈ ప్రక్రియ కొనసాగించవచ్చని ఈసీ నుంచి ఆదేశాలు జారీ కావడంతో ఆర్వో కేంద్రం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఉప ఎన్నికకు మొత్తంగా 316 నామినేషన్లు దాఖలయ్యాయి.

**ట్రిపుల్ ఆర్ బాధితులు...**

ప్రతిపాదిత రీజనల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) వల్ల భూముులు కోల్పోతున్న నిర్వాసితుల్లో 11 మంది రైతులు సైతం మంగళవారం నామినేషన్లు వేశారు. ఆర్ఆర్ఆర్ వల్ల రోడ్డున పడుతున్నామని మొరపెట్టుకున్నా ప్రభుత్వం వినిపించుకోనందున తమ బాధలు చెప్పుకోవడానికే నామినేషన్లు వేసినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు. అలాగే 10 మంది ఫార్మాసిటీ భూ నిర్వాసిత రైతులు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. వారితోపాటు సుమారు 200 మంది భూ నిర్వాసితులు నామినేషన్ కేంద్రం వద్దకు చేరుకొని తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేసి టీజీఐఐసీ పేరిట మార్చిన పట్టా భూములను తిరిగి రైతుల పేరిట నమోదు చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకే నామినేషన్లు వేశామని అభ్యర్థులు తెలిపారు. మరోవైపు రిటైరైనా ప్రభుత్వం నుంచి ఇంతవరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదంటూ పలువురు రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ 50 మంది మాల మహానాడు నేతలు సైతం నామినేషన్లు వేశారు. దీంతో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారి సంఖ్య భారీగా నమోదైంది.

# కాంగ్రెస్ అభ్యర్థిని మజ్లిస్ నిర్ణయించింది

రాజీనామా చేసిన తరువాత ఫాంహౌస్ నుంచి బయటకు రాని వారికి ఓటు వేస్తామా’అని అన్నారు. జూబ్లీహిల్స్ అంటే అక్కడ అన్నీ అద్దాల మేడలని ప్రజలకు ఒక దురభిప్రాయం ఉందని, ఇక్కడ వీధుల్లో చూస్తే మురుగు నీరు, చెత్త, వెలగని వీధి లైట్లు, పార్కుల కబ్జాలు కనిపిస్తాయని పేర్కొన్నారు.

**గుడి భూములు ఎంఐఎంకు: బండి సంజయ్**

జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి ఆలయానికి చెందిన 11 ఎకరాలను ఎంఐఎం పార్టీ వారికి రాసివ్వడానికి ముందస్తు అగ్రిమెంట్ జరిగిందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. సల్కం చెరువులో ఎంఐఎం కాలేజీ కడితే వారితో కాంగ్రెస్ నేతలు భాగస్వామ్యం పెట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో సైకిల్‌కి కూడా గతి లేని నాయకులు ఇప్పుడు కేజీల కొద్దీ బంగారు ఆభరణాలు వేసుకుని, పెద్ద పెద్ద కార్లలో తిరుగుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై మేం మాట్లాడం, మూసీపై మీరు మాట్లాడకండి అంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఒప్పందం నడుస్తోందని ఆరో పించారు. ఎంఐఎంలో ఇద్దరు జోకర్లు ఉన్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి చెరో 200 కోట్లు తెచ్చుకుని, పతంగి పార్టీని యూసఫ్‌గూడ చౌరస్తాలో వేలం వేస్తున్నార న్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేయడానికి కాంగ్రెస్‌కు అభ్యర్థి దొరకలేదని, అందుకే మజ్లిస్ నుంచి ఒక వ్యక్తిని అద్దెకు తెచ్చుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు కావాలంటే బీజేపీ అధికా రంలోకి రావాలని, దానికి జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు పాల్గొన్నారు.

# పాత నేరస్తుడు రియాజ్ కాల్చివేత

ప్రయత్నం చేశాడు. వద్దంటూ వారించినా వినలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే ఉన్న ఏఆర్ ఎస్సై కాల్పులు జరపగా, షేక్ రియాజ్ అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. జడ్జి సమక్షంలో పంచనామా నిర్వహించి రాత్రి 7 గంటల ప్రాంతంలో పోస్టుమార్టం పూర్తిచేసి రియాజ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలో రియాజ్ అంత్యక్రియలు నిర్వహించారు. ఆస్పత్రిలో కాల్చివేత ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్టు సీపీ సాయిచైతన్య తెలిపారు.

**కత్తితో పొడిచి తప్పించుకొని..**


ఈనెల 18న పాత నేరస్తుడు షేక్‌రియాజ్ ఇంటికి వచ్చాడని సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్, ఎస్సై విఠల్, ఇతర సిబ్బందికి సమాచారం వచ్చింది. బాబాన్ సాహెబ్ పహాడ్‌లోని నిజాంసాగర్ కెనాల్ వద్ద రియాజ్ కనిపించడంతో కానిస్టేబుల్ ప్రమోద్ వెంబండించి పట్టుకున్నారు. అనంతరం బైక్‌పై తీసుకెళుండగా, రియాజ్, కానిస్టేబుల్ ప్రమోద్ ఛాతీలో కత్తితో బలంగా పొడిచి పరారయ్యాడు. చికిత్స పొందుతూ ప్రమోద్ చనిపోయాడు. అనంతరం పోలీస్ కమిషనర్ సాయిచైతన్య 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రియాజ్ కోసం గాలింపు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సారంగాపూర్ శివారులో పాతబడిన ఓ లారీ క్యాబిన్‌లో రియాజ్ ఉన్నట్టు స్థానికులు చెప్పగా, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. రియాజ్ పారిపోతుండగా, ఆసిఫ్ అనే యువకుడు రియాజ్‌ను అడ్డుకున్నాడు. ఈ క్రమంలో ఆసిఫ్ రెండు చేతులకు గాయాలయ్యాయి. అప్పటికే పోలీసులు చుట్టుముట్టి రియాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జరిగిన పరిణామాల్లో రియాజ్ పోలీసు కాల్పుల్లో మరణించాడు.గాయపడిన ఆసిఫ్ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రి చికిత్స పొందుతున్నాడు.

# పాక్‌కు చుక్కలు చూపించాం

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి .. త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌ను మోకాళ్లపై నిలబెట్టాయి**

**సైన్యంలో స్వయం సమృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం**

**గోవా తీరంలో ‘ఐఎన్ఎస్ విక్రాంత్’పై దీపావళి వేడుకలు**



పనాజీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత త్రివిధ దళాలు అద్భుతమైన సమన్వయంతో పనిచేసి, అతి తక్కువ సమయంలోనే పాకిస్తాన్‌ను మోకాళ్లపై నిలబెట్టాయని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. మన సైన్యం పాకిస్తాన్‌ను భయకంపితులను చేసిందన్నారు. వాయుసేన నైపుణ్యాలు, నావికాదళం ధైర్య సాహసాలు పొరుగుదేశానికి చుక్కలు చూపించాయని తెలిపారు. ప్రధాని మోదీ గోవా తీరం లో స్వదేశీ యుద్ధ విమాన వాహకనౌక ‘ఐఎన్ ఎస్ విక్రాంత్’పై నావికాదళంతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన ఆదివారం సాయంత్రం ఇక్కడికి చేరుకున్నారు. రాత్రంతా ఐఎ న్ఎస్ విక్రాంత్‌లోనే ఉన్నారు. సోమవారం ఉదయం యోగా చేశారు. నావికా దళం జవాన్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాన్ని వీక్షించారు. నేవీ అధికారులు, సిబ్బంది దేశభక్తి గీతాలు ఆలపించారు. ఆపరేషన్ సిందూర్‌లో సైనిక దళాల విజయానికి గుర్తుగా ప్రత్యేకంగా రాసిన పాటను సైతం వారు ఆలపించారు. నేవీ సిబ్బందికి ప్రధాని మోదీ మిఠాయిలు తినిపించారు. విందు భోజనం చేశారు. పగటిపూట, రాత్రిపూట ఐఎంఐ%-%27 యుద్ధ విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌ను స్వయంగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశీయంగా నిర్మించుకున్న ఐఎన్ఎస్ విక్రాంత్ నౌక ఆత్మనిర్భర్ భారత్‌కు శక్తివంతమైన ప్రతీక అని అభివర్ణించారు. ఈ నౌకను మన నావికాదళానికి అప్పగించడం ద్వారా వలసవాద పాలన నాటి ఆనవాళ్లను వదిలించుకున్నామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఐఎన్ఎస్ విక్రాంత్ పాకిస్తాన్‌కు నిద్రలేని రాత్రుళ్లు మిగిల్చిందని అన్నారు. శత్రువును కాళ్లబేరానికి తీసుకొచ్చిందని కొనియాడారు. ఇది కేవలం యుద్ధనౌక కాదని.. 21వ శతాబ్దంలో మన కఠోర శ్రమ, నైపుణ్యం, అంకితభావానికి ఉదాహరణ అని స్పష్టం చేశారు. సైన్యంలో స్వయం సమృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. సైనిక దళాలు మరింత బలోపేతం కావాలన్నారు. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు ఆపరేషన్ సిందూర్‌లో తమ శక్తిసామర్థ్యాలను నిరూపించుకున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని చెప్పారు. సైన్యానికి అవసరమైన వేలాది పరికరాలను దేశీయంగానే తయారు చేసుకుంటున్నామని, దిగుమతులు నిలిపివేశామని అన్నారు. గత 11 ఏళ్లలో మన రక్షణ ఉత్పత్తులు మూడు రెట్లకుపైగా పెరిగాయని, గత ఏడాది రూ.1.5 లక్షల కోట్లకు చేరాయని హర్షం వ్యక్తంచేశారు. 2014 నుంచి 40కి పైగా దేశీయ యుద్ధ విమానాలు, జలాంతర్గాములను నావికాదళానికి అప్పగించామని తెలియజేశారు. త్రివిధ దళాలకు అవసరమైన ఆయుధాలు, పరికరాలు ఎగుమతి చేసే సామర్థ్యాన్ని సాధించామని వెల్లడించారు. రక్షణ ఉత్పత్తుల ఎగుమతిలో అగ్రస్థానానికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ స్పష్టం చేశారు.

**కోస్ట్ గార్డుపై ప్రశంసలు**

తీర రక్షక దళం(కోస్ట్ గార్డు) సేవలను ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. నేవీతో కలిసి పని చేస్తూ రాత్రింబవళ్లు తీర ప్రాంతాలను చక్కగా కాపాడుతోందని తెలిపారు. నావికా దళం కొత్త జెండాకు ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తిగా నిలిచారని వివరించారు. ఈ సందర్భంగా గోవా తీరంలో ఐఎన్ఎస్ విక్రాంత్‌తోపాటు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ మోర్ముగోవా, ఐఎన్ఎస్ చెన్నై, ఐఎన్ఎస్ ఇంఫాల్, ఐఎన్ఎస్ కోల్‌కతా, ఐఎన్ఎస్ తుశీల్, ఐఎన్ఎస్ తబర్, ఐఎన్ఎస్ తేజ్, ఐఎన్ఎస్ బేత్వా, ఐఎన్ఎస్ దీపక్, ఐఎన్ఎస్ అదిత్య వంటి విమాన వాహన నౌకలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. అలాగే పలు యుద్ధ విమానాల విన్యాసాలు ఎంతగానో అలరించాయి. నావికా దళం సిబ్బందితో కలిసి నిర్వహించుకున్న ఈ దీపావళి తనకు ఎంతో ప్రత్యేకం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన 2014 నుంచి ప్రతిఏటా దీపావళిని సైనికులతో కలిసి నిర్వహించుకుంటున్న సంగతి తెలిసిందే.

# బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో స్వాములకు మహా అన్నప్రసాద వితరణ

మిర్యాలగూడ అక్టోబర్ 21:-(వార్తమిర్రర్) : నేటి నుండి మండల కాలం బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నటు పులిమేడు ఆశ్రమ గురుస్వామి, మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్వామి అయ్యప్ప ఆలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో రేపటి నుండి మండల కాలం వరకు మహా అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందని అయ్యప్ప శివ ఆంజనేయ భవాని మాత మరియు ఇతర స్వాములు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని అదేవిధంగా రేపు చాలా గొప్ప పర్వదినమని స్వాతి నక్షత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ నక్షత్రమని అదేవిధంగా మన ప్రియతమ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాధవిల వివాహ వార్షికోత్సవ రోజు అని అదేవిధంగా కార్తీక మాస ప్రారంభోత్సవం కాబట్టి ఆ ఆదర్శ దంపతుల చేతుల మీదుగా ఈ మండల కాలం మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్విఘ్నంగా జరుగుతుందని మాధవిమాత సాక్షాత్తు అన్నపూర్ణేశ్వరి స్వరూపమని గత కొన్ని సంవత్సరాలుగా మన నియోజకవర్గంలో ఏ గుడి ప్రారంభోత్సవానికైనా ఏ పుణ్యకార్యాలకైనా వారే అన్న ప్రసాద సమర్పకులుగా ఉండి ప్రతి ఒక్కరికి కడుపునిండా భోజనం దొరికేదాకా లేదనకుండా అందరి కడుపు నింపే మహాతల్లి మాధవి అని ఆమె ధర్మపత్నిగా శాసనసభ్యులు బిఎల్ఆర్ కు దొరకటం వల్లనే ఎన్నో సేవా కార్యక్రమాలను మన బిఎల్ఆర్ నిర్విఘ్నంగా చేయగలుగుతున్నారని అడిగిన వారికి లేదనకుండా వారికి తోచిన సాయాన్ని అందజేస్తున్న ఆ పుణ్య దంపతులు సాక్షాత్తు ఆ శివపార్వతుల అంశగానే మిర్యాలగూడ నియోజకవర్గానికి లభించడం మన అదృష్టమని వారు తెలంగాణలోనే చెప్పుకోదగ్గ విధంగా మిర్యాలగూడ పట్టణంలో మూడు పర్యాయాలు అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఘనత ఆ దంపతులకే దక్కుతుందని అదేవిధంగా శ్రీ శ్రీనివాస కళ్యాణ శుభమస్తు కార్యక్రమం ద్వారా ఎన్నో వేల మంది జంటలకు వివాహ కిట్లను ముస్లింలకు షాదీ ముబారక్ కిట్లను కుల మతాలకతీతంగా హిందూ ముస్లిం క్రిస్టియన్ ప్రతి ఒక్కరికి వివాహ కిట్లను అందజేసిన ఘనత వారిదని ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఆయన చేసిన సేవా కార్యక్రమాలు చెప్పడానికి ఒకరోజు సమయం కూడా సరిపోదని విద్యార్థులకు యువతకు క్రీడాకారులకు మహిళలకు నిరుపేదలకు అన్నా అంటే నేనున్నా అంటూ ముందుకు వచ్చే మహోన్నత వ్యక్తి మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజల అదృష్టమని వారు ఇంకా ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేయడానికి అయ్యప్ప స్వామికి అష్టశ్వర్యాలు ఆయురారోగ్యాలు కల్పించాలని కోరుకుంటూ రేపటి నుండి జరగబోయే మహా అన్నప్రసాద కార్యక్రమంలో ప్రతి ఒక్క స్వామి పాల్గొనాలని కోరారు. అయ్యప్పదేవాలయ కమిటీ చైర్మన్



ముక్కాపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహా అన్న ప్రసాద కార్యక్రమం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఆధ్వర్యంలో బుధవారం నుండి ప్రారంభమవుతుందని శివ ఆంజనేయ అయ్యప్ప ప్రతి ఒక్క స్వామి అన్న ప్రసాద కార్యక్రమంలో క్రమశిక్షణతో పాల్గొనాలని అడగ్గానే అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేయడానికి ఒప్పుకున్నా శాసనసభ్యులు బిఎల్ఆర్ కు ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమై రెండు గంటలకు ముగుస్తుందన్నారు. ప్రతి ఒక్క స్వామి సకాలంలో విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని స్వాములందరూ సహకరించాలని అదేవిధంగా గత సంవత్సరం బిఎల్ఆర్ ఆధ్వర్యంలోనే అయ్యప్ప దేవాలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగిందని ఈ సంవత్సరం కూడా అదే విధంగా జరుగుతుందన్నారు. అదేవిధంగా మేము ఎప్పుడు ఏ సహాయము అడిగినా కాదనకుండా వెంటనే చేస్తున్న బిఎల్ఆర్ కి అయ్యప్ప స్వామి దయవల్ల ఎప్పుడూ శుభం జరగాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ గుడిపాటి నవీన్, 25 వ వార్డు ఇన్చార్జ్ గోదాల జానకిరామ్రెడ్డి, నాయుడు, గురుస్వామి, గురువారెడ్డి గురుస్వామి, బాలునాయక్ గురుస్వామి పాల్గొన్నారు

# గ్రూప్ -2లో ఎంపీఓ ఉద్యోగం సాధించిన పేద విద్యార్థికి ఎమ్మెల్యే బిఎల్ఆర్ సన్మానం

### ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మగౌరవం : ఎమ్మెల్యే బిఎల్ఆర్





మిర్యాలగూడ, అక్టోబర్ 21:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం గూడూరు చెందిన ఇరుగంటి లింగమ్మ, చిన్నమట్టయ్య దంపతుల కుమారుడు నాగరాజు ఇటీవల జరిగిన గ్రూప్ -2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపీఓ ఉద్యోగాన్ని దక్కించుకున్నందున ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అభినందించారు. ఈ మేరకు ఆయన నాయకులతో కలిసి నాగరాజు ఇంటికి వెళ్లి సన్మానించారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలని ఆయన కోరారు. పేద కుటుంబం నుంచి వచ్చిన నువ్వు ఉద్యోగ బాధ్యతలలో పేదల పక్షాన నిలబడి సేవలందించాలన్నారు. పేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో స్థానికులతో కలిసి దీపాలు వెలిగించి ఎమ్మెల్యే బిఎల్ఆర్ దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే బిఎల్ఆర్ తమ మధ్య దీపావళి వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శ్రేయస్సు, సామరస్యం నింపాలని కోరుకుంటున్నానన్నారు. ఈ పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకట్లపై వెలుగులు గెలిచిన సంకేతంగా భావిస్తామని అన్నారు. అదేవిధంగా గ్రామంలోని నూతనంగా నిర్మాణమై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఇందిరమ్మ ఇంటిని స్థానికులతో కలిసి సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మగౌరవంతో బతకాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలుపుతానని ఎమ్మెల్యే అన్నారు.



## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి అక్టోబర్ 21 : చౌటుప్పల్ మున్సిపాలిటీ బస్టాండ్ ఆవరణలో చౌటుప్పల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దీపావళి అమావాస్య రోజున అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా సోమవరపు సత్తయ్య గుప్తా విచ్చేసి అతని చేతులు మీదుగా అన్న ప్రసాదము పంపిణీ చేయడం జరిగినది. సత్తయ్య గుప్త మాట్లాడుతూ, అమావాస్య రోజున తన చేతుల మీదుగా అన్నదానం చేయడము తాను ఎంతో పుణ్యం చేసుకున్నట్లు అవుతుందని అన్నారు. పేదలకు అన్నప్రసాదం ప్రతి అమావాస్య రోజున పంపిణీ చేయడము ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కామశెట్టి చంద్రశేఖర్ గుప్తా, తడకమళ్ళ శ్రీనివాస్, నీలా రమేష్ గుప్తా, గజ్జల భాస్కర్, దాచేపల్లి విజయ్ గుప్తా, దాచేపల్లి రఘు, వి కిరణ్, అశోక్, కేదార్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో మియాపూర్ బిజెపి నాయకులు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మాగంటి గోపినాథ్ ఆకస్మిక మరణం తో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ కు ఉప ఎన్నికలు దరిమిలా వచ్చి పడ్డాయి. బి ఆర్ ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థి గా స్వర్గీయ మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీత, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి గా నామినేషన్ లు సమర్పించినారు. ఇక ఆఖరిగా సస్పెన్స్ కి తెరతీస్తూ బిజెపి జూబ్లీహిల్స్ అసెంబ్లీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి పేరు అనూహ్యంగా తెర మీదకు వచ్చిన విషయం విదితమే నామినేషన్ ఆఖరి రోజు అయిన మంగళ వారం రోజు లంకల దీపక్ రెడ్డి నామినేషన్ ఉదయం నుండి నగరం లోని వివిధ ప్రాంతాల అభిమానం తో వచ్చిన బిజెపి పార్టీ నేతలు శ్రేణుల కోలాహలం గా ఊరేగింపు గా నామినేషన్ రిటర్నింగ్ అధికారులకి దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, గుండె గణేష్ ముదిరాజ్, పార్నంది నాగులు, జై శ్రీను, కొంచం శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## సగర విద్యార్థుల ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవానికి మంత్రిని ఆహ్వానించిన సగర సంఘం నాయకులు

### ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవానికి హాజరవుతా: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి : హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న సగర విద్యార్థుల ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ని ఆహ్వానిస్తున్న తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, మక్తల్ మున్సిపల్ మాజీ చైర్మన్ పావని మల్లికార్జున్ సగర లు.మంత్రి వాకిటి శ్రీహరి సానుకూలంగా స్పందిస్తూ కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు



## కోటేష్ సాగర్ కుటుంబానికి అండగా నిలిచిన సగర సంఘం నాయకులు

### మృతుడి భార్య చంద్రకళకు ఆర్థిక సహాయం అందించిన వనస్థలిపురం సగర సంఘం

వనస్థలిపురం వార్త మిర్రర్ ప్రతినిధి : వనస్థలిపురం పరిధిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన మాదంశెట్టి కోటేష్ సాగర్ కుటుంబానికి అండగా నిలిచిన వనస్థలిపురం సగర సంఘం నాయకులు, మాదంశెట్టి కోటేష్ సాగర్ కుటుంబాన్ని పరామర్శించి, మాధం శెట్టి కోటేష్ చంద్రకళ కు సగర సంఘం సభ్యులు 93 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు, ఆధైర్య పడవద్దు సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు వనస్థలిపురం సగర సంఘం అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, ప్రధాన కార్యదర్శి వేముల రామ్మోహన్ సాగర్, వనస్థలిపురం సగర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నవంబర్ 1వ తేదీ లోపు ఫీజు రియంబర్స్మెంట్ రూ.900 కోట్లు నిధులు విడుదల చేయాలి

### రంగారెడ్డి జిల్లా ప్రైవేటు డిగ్రీ కళాశాల కమిటీ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



రామంతపూర్ వార్త మిర్రర్ ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫీజు రియంబర్స్మెంట్ నవంబర్ 1 వ తేదీ లోపు రూ.900 కోట్లు నిధులు విడుదల చేయాలని, లేనియెడల ఫీజు రియంబర్స్మెంట్ నిధులు చెల్లించకపోతే నవంబర్ 3వ తేదీ నుండి తెలంగాణలో ప్రైవేట్ కళాశాలలు బంద్ చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు, రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ కళాశాలల కమిటీ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, ఫీజు రియంబర్స్మెంట్ అందక సామాన్య, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు, ఫీజు రీయింబర్స్మెంట్ పథకం అమలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి విధానంతో లక్షలాది విద్యార్థులు, వందలాది కళాశాలల యజమానులు మానసిక ఆందోళన చెందుతున్నారని అన్నారు, రాష్ట్రంలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ పై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వం గానీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కానీ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను విడుదల చేయకపోవడం వల్ల దాదాపు రూ. 7,500 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని బిల్లులు చెల్లింపులో జరుగుతున్న నిర్లక్ష్యం కారణంగా కాలేజీల నిర్వహణ భారమై రాష్ట్రవ్యాప్తంగా వందలాది కాలేజీలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు



## మంత్రి శ్రీహరి ముదిరాజ్ ను కలిసిన టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిదర్శనమైన దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖ క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి ముదిరాజ్ ని, వారి అధికారిక నివాసంలో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలలో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేయడానికి చొరవ చూపి తీర్మానం ప్రవేశపెట్టి, ఆమోదించేలా ప్రక్రియ చేపట్టినందుకు గాను, మరియు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్. ఈ సందర్భంగా బీసీలకు ఇచ్చిన మాట మేరకు 42% రిజర్వేషన్ ఇచ్చి బలహీన వర్గాల అభ్యున్నతికి, వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి, వారి సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, వారిని గుర్తించి రాజకీయంతో పాటు అన్ని రంగాలలో ముందుకు రావాలని కృషి చేస్తుందని తెలిపారు. భేటీలో యువజన నాయకులు ములింటి లక్ష్మీనారాయణ, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మానవునిలోని పంచకోశాలు.. ప్రకృతిలోని పంచభూతాలు (తిరుమల శంకర్)



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 21 : నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశం... జగత్తంతా నిండిన పంచభూతాలవి... వాటిని పరిశోధించాలి...పరిరక్షించాలి.ఆరాధించాలి... ఎందుకంటే అవి ప్రకృతికి ప్రతిరూపాలు... మనుగడకు ఆలంబనలు... వాటిని స్వచ్ఛంగా ఉంచుకోవడం మనిషి ధర్మం. వాటికి ప్రణమిల్లుదాం. వాటి విశిష్ఠతలు తెలుసుకుందాం...పంచభూతాలకు ప్రతీక అయిన ప్రకృతిని పూజించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. మనం చేసే పూజలు భూ తత్త్వానికి, అభిషేకాదులు జలతత్వానికి, యజ్ఞయాగాది క్రతువులు అగ్నితత్వానికి, మంత్రోచ్చారణ వాయు తత్త్వానికి, ధ్యానం మొదలైన సాధనలు ఆకాశ తత్వానికి ప్రతీకలు. మొత్తంగా మనిషి మనిషిగా మారడానికి, ప్రకృతితో అనుబంధం పెంచుకోవడానికి, అంతిమంగా మోక్షాన్ని సాధించటానికి పంచభూతాత్మకమైన ప్రకృతే ఆలంబన అనే సందేశం ఇందులో దాగి ఉంది. భూమండలాన్ని ఆవరించి ఉన్న పంచభూతాలు మనిషిలోనూ ఉన్నాయి. వాటి వల్లే మనిషి సుఖంగా జీవించగలుగుతున్నాడు. అవి తమ శక్తులు ప్రసారం చేయటంతో పాటు కర్తవ్యాన్ని ఏమరుపాటులేకుండా నిర్వహిస్తుంటాయి. అందువల్లనే మానవ జీవన వ్యవస్థతో పాటు మొత్తం ప్రాణి వ్యవస్థ నడుస్తోంది. ఈ విషయాన్ని మనిషి గుర్తించాలి. ఈ జీవనచక్రం సవ్యంగా సాగిపోవటానికి ప్రకృతితో, తనని తానను సమన్వయం చేసుకోవాలి. ప్రకృతిని ఆశ్రయించాలే కానీ ఆక్రమించకూడదు. ఈ సూత్రం ఆధారంగానే సనాతన భారతీయ ఆధ్యాత్మిక వ్యవస్థ రూపుదిద్దుకుంది. మనిషిలో పంచకోశాలు ఉంటాయి. అవి అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలు. వీటిలో అన్నమయ కోశం భూ తత్త్వానికి, ప్రాణమయ కోశం జలతత్వానికి, మనోమయకోశం అగ్నితత్వానికి, విజ్ఞానమయకోశం వాయుతత్వానికి ఆనందమయకోశం ఆకాశతత్త్వానికి సంబంధించి ఉంటాయి. వీటితో పాటు పంచభూతాల ప్రతీకలుగా మానవ శరీరంలో ఐదు నాడీకేంద్రాలు ఉంటాయి. వీటిని శక్తిచక్రాలు అంటారు. వీటిలో మూలాధార చక్రం భూ తత్వాన్ని, స్వాధిష్టాన చక్రం జలతత్వానికి, మణిపూరక చక్రం అగ్నితత్వానికి, అనాహతచక్రం వాయుతత్త్వానికి, విశుద్ధిచక్రం ఆకాశతత్త్వానికి ప్రతీకలుగా ఉంటాయి. ఈ ఐదు చక్రాలు కాకుండా శరీరంలో ఉండే ఆజ్ఞ, సహస్రార చక్రాలు అన్ని తత్త్వాలకు అతీతం. మనిషి ఆలోచనలు, నడవడిక, సంస్కారం, ప్రారబ్ధకర్మ వల్ల ఇవి ప్రభావితమవుతుంటాయి.

ప్రకృతిలోని పంచభూతాలను పరిరక్షించుకోవడం, కలుషితం కాకుండా చూడడం, భావితరాలకు ప్రాకృతిక వారసత్వ సంపద అందించడం మొదలైన అంశాల గురించి రుక్, యజుర్, అధర్వణ వేదాల్లో విస్తారంగా ఉంది. ఓం భూశ్శాంతి ఓం భువశ్శాంతి..' – భూమికి శాంతి కలుగుగాక. భూమ్యాకాశాల మధ్యలో ఉండే మొత్తం ప్రదేశమంతటికీ శాంతి కలుగుగా అంటుంది. కృష్ణ యజుర్వేదంఅధర్వణవేదం వాయువును మొత్తం ప్రపంచానికి వైద్యుడిగా పేర్కొంది. రుగ్వేదంలో 'యదతో వాత తే గృహే అమృతస్య నిధిరిత: తేన నో దేహి జీవాసి...' అంటూ ప్రార్థన మంత్రం ఉంది. 'నీతో అమృతనిధి ఉంది... ఓ వాయు దేవా! నీవు మాకు దీర్ఘ జీవనాన్ని ప్రసాదించమ'ని దీని అర్థం. మొత్తంగా ప్రకృతిలోని వాయుతత్త్వ ప్రాధాన్యాన్ని ఈ మంత్రాలు వివరిస్తున్నాయి.లి జలవనరుల పరిరక్షణ ప్రాధాన్యం అధర్వణవేదంలో కనిపిస్తుంది. నీటిని పాడుచేయటం మహాపాపమని, వర్షపునీరు అత్యంత పరిశుభ్రమైందని, ఈ నీటికి ఎన్నో వ్యాధులను నయం చేసే శక్తి ఉందని చెబుతుంది. ఇదే వేదంలో చెప్పిన 'సముద్రే అంతర్నిహితాని నాభి', రుగ్వేదంలోని 'ఆప ఓషధుతః.. అవస్తు ద్యౌర్వనగిరయో హృషీకేశః' తదితర మంత్రాలు జలవనరుల ప్రాధాన్యత, సంరక్షణ గురించి వివరిస్తాయి. నదుల్లో ఉమ్మి వేయడాన్ని కూడా నిషేధించాయి మన శాస్త్రాలు. మన చేతి వేళ్లలో కూడా పంచభూత తత్త్వం నిక్షిప్తమై ఉంది. ఆ శక్తిని జాగృతం చెయ్యగలిగితే మన చేతికి ఎంతో శక్తి ఏర్పడుతుంది. 'ఆ చేతిలో ఏదో మహత్తు ఉంద'ని చెప్పిడానికి ఏర్పడటానికి కారణం ఇదే. బొటన వేలు అగ్నితత్త్వానికి, చూపుడు వేలు వాయుతత్త్వానికి, మధ్యవేలు ఆకాశ తత్త్వానికి, ఉంగరపు వేలు భూతత్త్వానికి, చిటికిన వేలు జలతత్త్వానికి సంకేతం. మంత్రజపాలు చేసేటప్పుడు అంగన్యాస, కరన్యాసాలు చేస్తారు. ఈ ప్రక్రియలో చేతివేళ్ల మొదలు నుంచి కొన వరకు సున్నితంగా తాకుతారు. దీనిద్వారా ఆ వేళ్లలో ఉండే పంచభూత శక్తులు ఉద్దీపనం చెందుతాయి. తద్వారా మనిషిలో ఆత్మచైతన్యశక్తి జాగృతమవుతుంది. అలాగే, ఆశీర్వచనం తీసుకునేటప్పుడు కూడా హస్త మస్తక సంయోగం ద్వారా శక్తి ప్రసారం జరుగుతుంది. అందుకే సాధకులైన పెద్దల నుంచి ఆశీర్వచనం తీసుకోవాలని చెప్పారు.

ఈ సృష్టి మొత్తం పంచభూతాల కలయికతో ఏర్పడిందే. సృష్టికి ఆధారమైన ఈ పంచభూతాలు మానవ శరీరం వాటితోనే ఏర్పడింది. శరీరంలోని వివిధ భాగాల్లో వివిధ తత్త్వాలు, శక్తుల రూపంలో ఇవి కేంద్రీకృతమై ఉంటాయి. మనిషి స్థూల దేహానికే కాదు సూక్ష్మ దేహానికి కూడా ఇవే ఆధారం.

1. పృథివి (భూమి) :వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే కర్మేంద్రియాలు పృథివీ తత్త్వం ద్వారా ఏర్పడతాయి.
2. జలం :ఇది శరీరంలో రక్తరూపంలో ఉంటుంది. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే పంచతన్మాత్రలు జలతత్త్వానికి ప్రతీకలుగా ఉంటాయి.
3. అగ్ని : జఠరాగ్ని రూపంలో శరీరంలో ఉంటుంది. చర్మం, ముక్కు, కళ్లు, చెవులు, నాలుక అనే ఐదు జ్ఞానేంద్రియాలు అగ్ని తత్త్వం ఆధారంగా ఏర్పడ్డాయి.
4. వాయువు : శరీరంలో ప్రాణం వాయురూపంలోనే ఉంటుంది. ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమాసం అనే పంచప్రాణాలు ఈ తత్త్వం ద్వారా ఏర్పడ్డాయి.
5. ఆకాశం: అంతఃకరణంగా ఆకాశతత్త్వం మనిషిలో ఉంటుంది. మనస్సు, బుద్ధి, చిత్తం, జ్ఞానం, అహంకారం అనే అంతరింద్రియాలు దీని ద్వారా ఏర్పడతాయి.



**తిరుమల శంకర్**

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమకారుడు, విద్యావేత్త గొరిగే ప్రదీప్ జన్మదిన వేడుకలు

### ప్రదీప్ కు పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ నాయకులు, యువకులు



ఎల్బీనగర్,21 అక్టోబర్: తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమ నాయకుడు, విద్యావేత్త, సంఘ సేవకుడు హయత్ నగర్ గ్రామవాసి గొరిగే ప్రదీప్ జన్మదిన వేడుకలను దీపావళి పండుగ రోజున దీపావళి కాంతుల మధ్యన ఘనంగా జరుపుకున్నారు. హయత్ నగర్ గ్రామంలోని తన నివాసం ఆవరణంలో ఘనంగా నిర్వహించిన జన్మదిన వేడుకలకు ప్రదీప్ అభిమానులు, స్నేహితులు, పలు రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై ప్రదీప్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పర్వదినం రోజున ప్రదీప్ పుట్టినరోజు రావడంతో యువకులు, అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచాలు పేలుస్తూ భారీ గజమాలను డప్పు వాయిద్యాలతో, బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా తరలివచ్చి ప్రదీప్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి గజమాలను వేసి కేకులు కట్ చేయించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ పుట్టినరోజు వేడుకలలో హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామా తిరుమలరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు, తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమకారుడు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమకారుడు మాధవరం నరసింహారావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు కాటేపాక స్కైలాబ్, బిజెపి నాయకుడు వాసు చౌదరి, శక్తి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అజయ్ కుమార్ యాదవ్, బిఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు పాక సాయి కిరణ్ యాదవ్, చిరుమామిళ్ల హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎంపిటిసి కుటుంబాన్ని పరామర్శించిన మాజీమంత్రి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 21 : జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ బూర్గుల రాజేందర్ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీమంత్రి జీవన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు. వీరి వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, నాయకులు బాపురపు నరసయ్య, మహిపాల్, పాశం భూమయ్య, షాకీర్, దాసరి గంగాధర్, రాజ రెడ్డి, ఆనందం, రాజేష్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూర్గు క్రిష్ణారెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి అక్టోబర్ 21 : చౌటుప్పల్ మండలం వ్యవసాయ మార్కెట్ యార్డు లోని వరి ధాన్యాన్ని పరిశీలించిన స్థానిక ఆర్డీవో శేఖర్ రెడ్డి పాల్గొనడం జరిగింది.ఆరు కాలాలు కష్టపడి పండించిన వరి ధాన్యం వర్షాలతో మధ్య దళారులతో మద్దతు ధర లేక అధిక తూకంతో రైతాంగం నష్టపోతున్నారు. కేంద్రాలు ప్రారంభించిన నేటికీ కొనుగోలు జరగలేదు.వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధర కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు రైతులకు షెడ్లు, మంచినీరు, వాచ్ మెన్, కరెంట్, ధాన్యం ఆరబోయడానికి నేల చదును చేయాలి, రైతాంగానికి ఇబ్బందులు లేకుండా ప్రాథమిక వసతులు కల్పించాలి హమాలి డబ్బులు చెల్లించాలని ఆర్డీవో కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోయ యాదయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షుడు పడమటి కృష్ణారెడ్డి, బొక్క యాదిరెడ్డి, ఏనుగు నర్సిరెడ్డి, గడశాట నరసింహ, జంగయ్య, నర్సిరెడ్డి, యాదమ్మ, రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకట్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కనిపించడం లేదు ఆచూకీ తెలిస్తే తెలియజేయండి



మిర్యాలగూడ అక్టోబర్ 21:-మిర్యాలగూడ టౌన్ గాంధీనగర్ కు చెందిన అవిరేండ్ల పిరమ్మ వయసు 38 సంవత్సరాలు ఈ నెల 18 మధ్యాహ్నం12 గంటల 30 నిమిషాల నుంచి కనిపించడం లేదు. ఫిర్యాదారుడు అవిరెండ్ల విద్యాసాగర్ అతని భార్య అవిరెండ్ల పిరమ్మ గొడవపడిన విషయంలో ఫిర్యాదారుడు అవిరెండ్ల పీరమ్మ మీద చేయి చేసుకోవడంతో ఫిర్యాదారుడు ఇంట్లో లేని సమయంలో అవిరెండ్ల పిరమ్మ ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుండి వెల్లిపోయింది. అవిరెండ్ల పిరమ్మ సుమారు 4.5 అడుగుల ఎత్తు ఉండి ఎరుపు రంగులో ఉంటుంది, ఇంట్లో నుండి వెళ్లేటప్పుడు గోధుమ రంగు పంజాబీ డ్రెస్ వేసుకొని ఉన్నది. ఆమెకు ఇద్దరు కుమారులు రిషిక్ 17 సంవత్సరంలో చేతన్ 16 సంవత్సరాలు సంతానం ఉన్నారు. ఆచూకీ తెలిసినవారు ఎం. నాగభూషణరావు ఇన్స్పెక్టర్ సెల్ 8712670149, ఎ. సైదిరెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ సెల్ 904555290 నెంబర్లకు సమాచారం తెలపాలన్నారు.



# మిర్యాలగూడ డివిజన్‌లో 1,100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

### ::: ఎడిఎహెచ్ శంకర్ రావు

మిర్యాలగూడ, అక్టోబర్ 21:-( వార్త మిర్రర్) : మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్ బంధం ఈదులగూడ గొల్లగూడెం కాలనీలలో మంగళవారం మిర్యాలగూడ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శంకర్ రావు ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. మిర్యాలగూడ పట్టణ, పరిసర గ్రామాల లో రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని కోరారు. ఆయా కాలనీలలో నిర్వహించిన శిబిరాల్లో 1,100 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ డి.కృష్ణనాయక్, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ అజ్మార్ నారాయణ, గోపాల మిత్రులు ప్రవీణ్, శ్రీను, నాగరాజు, శ్రీను, రైతులు పాల్గొన్నారు.



# పోలీస్ ఆఫీసర్లను సన్మానించిన మహిళా సంఘం

మిర్యాలగూడ అక్టోబర్21 :- (వార్తమిర్రర్) : పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్లో పోలీస్ వారి సేవలను అభినందిస్తు బీసీ సంక్షేమ సంఘం మహిళా జిల్లా కార్యదర్శి బంటు కవిత, జిల్లా ఎస్సీ మహిళా సంఘం అధ్యక్షురాలు చిత్రం ఉమా ఆధ్వర్యంలో పోలీస్ ఆఫీసర్లను శాలువాతో సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఐ నాగభూషణరావు, ఎస్ఐ ఎ.సైదిరెడ్డి, ఆమ్రిన్, ఎఎస్ఐ కుంచెం శ్రీనివాస్,, నరసింహ, పోలీస్ ఆఫీసర్లను శాలువాతో సత్కరించారు.



# ఎంబీసీ చైర్మన్ జెరిపేట్ జైపాల్ జన్మదిన వేడుకలలో బీసీ ఐక్యవేదిక నాయకులు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంబీసీ చైర్మన్ జెరిపేట్ జైపాల్ జన్మదిన సందర్భంగా బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ జెరిపేట్ జైపాల్ నివాసం లో తన సహచర బృందం తో కలిసి శాలువలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జెరిపేట్ జైపాల్ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి సేవ చేయాలని కోరుకున్నారు. బీసీల అభ్యున్నతికి ఆయన నిరంతరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాయన్న ముదిరాజ్, బీసీ సంఘం యువ నాయకులు అందెల కుమార్ యాదవ్, శేరిలింగంపల్లి బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి, సీనియర్ రిపోర్టర్ కృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ బండి రామకృష్ణ గౌడ్, గోపి నగర్ బీసీ సంఘం అధ్యక్షులు సిరిపురం హరికృష్ణ చారి తదితరులు పాల్గొని జెరిపేట్ జైపాల్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

**ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ, గ్రామ పంచాయతీ భవన పనులను వేగవంతంగా పూర్తి చేయాలి**

**15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.**

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్**





వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 21 : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని సింగరావుపేట, శ్రీరాం నగర్, ఇటిక్యాల గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, అంగన్వాడీ, గ్రామ పంచాయతీ, హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరావుపేట్ లోని ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్ధిదారులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు మొదలు పెట్టని వారు ఉన్నట్లయితే వారిని వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ఇంటి నిర్మాణాలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని ఆరా తీశారు. గ్రామంలో ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని ఎన్ని గ్రౌండ్లింగ్ వరకు వచ్చాయని ఎన్ని స్లాబ్ దశకు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారికి సెర్ప్, ద్వారా రుణాలు మంజూరయ్యేలా చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, రవాణా కూలీల వేతనాలు మాత్రం లబ్ధిదారులు చెల్లిస్తే ఇసుక ఉచితంగా సమకూరుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. శ్రీరాం నగర్ లోని అంగన్వాడీ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) నిధుల ద్వారా మంజూరై నూతనంగా నిర్మిస్తున్న పనులను పరిశీలించారు. అంగన్వాడీ, గ్రామ పంచాయతీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అదేవిధంగా త్వరగా పనులు పూర్తిచేయాలనీ అధికారాలకు సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. నిర్మాణ పనులు వేగవంతం చేయాలనీ అదేవిధంగా నాణ్యతలోపం లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనులు పూర్తిచేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఈఈపిఆర్ లక్ష్మణ్ రావు, జిల్లా హౌసింగ్ పిడి ప్రసాద్, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 24, 25న జరిగే 05వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చెయ్యండి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 21 : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ఐదవ మహాసభలు అక్టోబర్ 24, 25 మహబూబాబాద్ పట్టణములో ఏవీ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగే మహాసభల కు జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాల ఉద్యోగ కార్మికులు అక్టోబర్ 24 న ఉదయం పదిగంటలకు రైల్వే స్టేషన్ నుండి జరిగే ప్రదర్శనలో కార్మికులంతా పాల్గొని, అక్టోబర్ 25 న జరిగే బహిరంగ సభను కూడా జిల్లాలోని ఉద్యోగ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జగిత్యాల జిల్లా కమిటీ నాయకులు పులి మల్లేశం ఒక ప్రకటన లో కోరారు.





## ఘనంగా సదర్ ఉత్సవాలు

మాదాపూర్ వార్త మిర్రర్ : ఘనంగా సదరు ఉత్సవాలు ఎలామేలా నరసింహ ఆదివారంలో ఘనంగా జరిగాయి. మాదాపూర్ డివిజన్ గుట్టల బేగంపేట్ లోని సదరు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సదరు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని వాళ్ళు తెలిపారు. మల్లన్న దేవాలయం నుండి మాదాపూర్ ఊరు లో నీ గుడిని దర్శించుకొని అయ్యప్ప సొసైటీలో స్టేజ్ దగ్గర దున్నపోతు కుస్తీ ఆటలో పాల్గొని తప్పకుండా విజయా సాధిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ, ప్రవీణ్,సాయి, భాజ్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సహస్ర (వెయ్యి) లింగాల ఆలయంలో దీపాలంకరణ, అన్నపూజ





వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 21 : జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసలోగల సహస్ర (వెయ్యి) లింగాల ఆలయంలో దీపాలంకరణ మహొత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. ఒక్కో లింగం వద్ద భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కాగా, సహస్ర లింగాల వద్ద వెలిగించిన దీపాలు భక్తులకు కనువిందును అందించింది. అనంతరం అన్నపూజ మరియు మంగళవారం రోజున దేవాలయంలో దీపావళి అమావాస్య సందర్భంగా లక్ష్మీనారాయణ లకు అభిషేకము అలంకరణ, అష్టోత్తర నామాలతో పూజా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ చైర్మన్ అండ్ ఫౌండర్ నలమాస గంగాధర్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.




# టాటా మోటర్స్ @ లక్ష యూనిట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ మరోసారి సత్తాచాటింది. ప్రస్తుత పండుగ సీజన్‌లో నవరాత్రి నుంచి దీపావళి వరకు(30 రోజుల్లో) లక్ష వాహనాలను విక్రయించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో అమ్ముడైన వాహనాలతో పోలిస్తే 33 శాతం ఎగబాకినట్టు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా అన్ని వాహన సంస్థలు తమ వాహన ధరలను భారీగా తగ్గించడంతోపాటు పండుగ సీజన్ కూడా తోవడం విక్రయాలకు కలిసొచ్చింది. వీటిలో ఎక్కువ శాతం ఎస్‌యూవీలు కాగా, వీటితోపాటు ఎలక్ట్రిక్ వాహనాలు కూడా గణనీయమైన వృద్ధిని సాధించాయని టాటా మోటర్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర తెలిపారు. ఈ వృద్ధికి ఎస్‌యూవీ వాహనాలు చాలా కీలకంగా మారయని, వీటిలో 38 వేల యూనిట్ల నెక్సాన్ మాడళ్లు అమ్ముడవగా, పంచ్ 32 వేలు ఉన్నాయని చెప్పారు.

## సింప్లిజిత్ చేతికి అరేబియన్ సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 21: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఇన్‌ఫ్రా సేవల సంస్థ సింప్లిజిత్ గ్రూపు.. వ్యాపార విస్తరణలో భాగంగా నూతన రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం అరేబియన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఏసీసీ) ఇండియాలో మెజార్టీ వాటాను కొనుగోలు చేసింది. ఈ కొనుగోలుతో సింప్లిజిత్ గ్రూపు..రియల్టీ, పేపర్ ఉత్పత్తుల ట్రేడింగ్, బ్రాండింగ్ అండ్ కమ్యూనికేషన్స్ వంటి మూడు కొత్త విభాగాల్లోకి ప్రవేశించినట్టు అవుతుందని కంపెనీ ఎండీ అభిజిత్ జయంతి తెలిపారు.

స్కోడా ఒక్టావియా నయా మాడల్ దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను పరిచయం చేసింది స్కోడా ఇండియా. ఒక్టావియా పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను తీసుకొచ్చింది.



## స్కోడా ఒక్టావియా నయా మాడల్.. ధర 49.99 లక్షలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను పరిచయం చేసింది స్కోడా ఇండియా. ఒక్టావియా పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను తీసుకొచ్చింది. కేవలం 100 యూనిట్లు మాత్రమే విక్రయించనున్న ఈ కారు ధర రూ.49.99 లక్షలుగా నిర్ణయించింది. రెండు లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 6.4 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది.



## మూరత్ మురిపెం అంతంతే

### సెన్సెక్స్ 63, నిఫ్టీ 25 పాయింట్ల లాభం

ముంబై, అక్టోబర్ 21: దేశీయ స్టాక్ మార్కెట్లో పటాకులు పేలలేవు. దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన మూరత్ ట్రేడింగ్‌లో సూచీలు అంతంత మాత్రంగానే లాభపడ్డాయి. నూతన సంవత్సరం సంవత్ 2082 తొలిరోజు మెరుపులు లేకుండా ముగిశాయి. కేవలం గంటపాటు సాగిన ట్రేడింగ్‌లో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 62.97 పాయింట్లు ఎగబాకి 84,426.34 వద్ద ముగియగా, నిఫ్టీ 25.45 పాయింట్లు అందుకొని 25,868.60 వద్ద ముగిసింది. మధ్యాహ్నం 1.45 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ సెషన్ 2.45 గంటలకు ముగిసింది. దీపావళి సందర్భంగా ట్రేడర్లు, ఇన్వెస్టర్లు ఈరోజు నూతన అకౌంటింగ్ బుక్స్‌ను తెరుస్తారు. ఈ మూరత్ ట్రేడింగ్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్ అత్యధికంగా 1.42 శాతం లాభపడగా, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేరు లాభాల్లో ముగిశాయి. కానీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, భారతీ ఎయిర్‌టెల్, మారుతి సుజుకీ, ట్రెంట్, టీసీఎస్ షేర్లు తగ్గుముఖం పట్టాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఒక్క శాతం వరకు లాభపడ్డాయి. రంగాలవారీగా ఇండస్ట్రియల్స్, టెలికాం, కమోడిటీస్, క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్, మెటల్ రంగ షేర్లు ఒక్క శాతం వరకు పెరుగగా..బ్యాంకింగ్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి. మరోవైపు, సంవత్ 2081లో సెన్సెక్స్ 4,974.31 పాయింట్లు లేదా 6.26 శాతం, నిఫ్టీ 1,637.80 పాయింట్లు లేదా 6.76 శాతం రిటర్నులు పంచింది.




## ఎల్‌టీఐమైండ్‌ట్రీ నుంచి వైదొలిగిన దేశ్‌పాండే

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: ఎల్‌టీఐమైండ్‌ట్రీ నుంచి నచికేత్ దేశ్‌పాండే వైదొలిగారు. ఈ నెల 31 నుంచి హోల్-టైం డైరెక్టర్‌తోపాటు ప్రెసిడెంట్ పదవి నుంచి వైదొలుగుతున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఎల్‌టీఐమైండ్‌ట్రీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణియన్ మాట్లాడుతూ..దేశ్‌పాండే సారథ్యంలో కంపెనీ అన్ని రంగాల్లో రాణించిందని, తదుపరి వృద్ధికి ఆయన పునాది వేశారన్నారు.